క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శంషాబాద్ పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ షేక్‌బాషా తెలిపారు. ఉదయం 11 చి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌జీఐఏ పీఎస్, సిద్ధాంతి, హుడాకాలనీ, ఆర్‌బీనగర్‌కాలనీ, రాళ్లగూడ, ఎయిర్‌పోర్టు కాలనీ, ఫోర్ట్‌గ్రాండ్, హుడాకాలనీ, సిద్దులగుట్టకమాన్, మజీద్‌గడ్డ, రాళ్లగూడ, రాయల్ విల్లా, సాయివిహార్, తొండుపల్లి, ఊట్‌పల్లి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

అభినందన


కొల్లూరి అనిల్‌కుమార్

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మగౌరవ భవన ట్రస్ట్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కొల్లూరి అనిల్‌కుమార్‌ను ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు నేదునూరు కనకయ్య అభినందించారు. మూడు దశాబ్దాలుగా కుమ్మర సంఘంలో గణనీయమైన సేవలు చేస్తూ కుమ్మర సామాజిక వర్గం సామాజిక, ఆర్థిక వికాసం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నేతలు మల్లికంటి సిద్ధయ్య, మలికంటి వెంకన్న, తీగుళ్ల యాదగిరి, నమిలకొండ ప్రభాకర్, నాంపల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరికొండ వెంకటేష్, కె.శంకర్, కె.కృష్ణ, ఎస్.శంకర్, ఎం.కుమార్, బి.సత్యం, ఎస్.శ్రీనివాస్, బి.ధరణీధర్, డాక్టర్ పరశురామ్, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు



శాస్త్రిపురం: బస్తీలలో వీధి దీపాలు వెలగకపోవడంతో శాస్త్రీపురం డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా డివిజన్‌లోని పలు బస్తీలలో వీధి దీపాలు వెలగడం లేదు. తమ బస్తీలో దీపాలు వెలగక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని డివిజన్ పరిధిలోని హసన్‌నగర్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో బయటకు రావాలంటే భయంగా ఉంటుందని పనుల నుంచి వచ్చే మహిళలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో వీధి కుక్కలు వెంట పడుతున్నాయి. సంబంధిత అధికారులకు వీధి దీపాలకు మరమ్మతు చేయించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకొని శాస్త్రీపురం డివిజన్‌లో వెలగని విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: శ్రావణ ఆదివారం సందర్భంగా రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలో కొలువుదీరిన ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేసిన తర్వాత ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు.

మాగంటి గోపీనాథ్ మృతి తీరని లోటు

రహమత్‌నగర్ : ప్రజల మనిషిగా మన్ననలు పొందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మరణం బీఆర్‌ఎస్‌కు తీరని లోటని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ మైదానంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మాగంటి గోపీనాథ్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలుపించుకుని మాగంటి గోపీనాథ్ ఆశయాన్ని సాధించుకోవాలని కోరారు. అనంతరం గోపీనాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దివంగత ఎమ్మెల్యే గోపీనాథ్ సతీమణి సునీత, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎన్నికల పరిశీలకులు తక్కలపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేడు విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకుడు సోహైల్, కార్పొరేటర్ రాజ్‌పటేల్, మాజీ కార్పొరేటర్ ఎంఏ షఫీ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, కాసాల అరుణ్, వినోద్ కుమార్ గౌడ్, లియాకత్ అలీ, నర్సింహారెడ్డి, షేక్ చోటు, గఫూర్, ఫయాజ్ పాల్గొన్నారు.


పాలమాకులలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

మొక్కలతో కళకళ

ఏపుగా పెరుగుతున్న మొక్కలు | కనువిందు చేస్తున్న పచ్చదనం

విజయవంతంగా వనమహోత్సవం


మణికొండ దళిత శ్మశాన వాటికలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

రాజేంద్రనగర్ జోన్ బృందం: గడచిన 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు వన మహోత్సవ కార్యక్రమంలో నాటిన మొక్కలు కళకళలాడుతున్నాయి. రోడ్లు, బస్తీలు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలు, శ్మశాన వాటికలు, పార్కులు, డివైడర్‌లు ఎక్కడ చూసినా పచ్చటి చెట్లు కనిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు, ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, ఒక జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో వన మహోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు.

- మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే వర్షాలు పడటంతో మొక్కలు కాస్తా నాటుకొని ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం నాటిన మొక్కలతో పాటు గతంలో నాటిన మొక్కలు కాస్తా చెట్లుగా ఎదిగి కనువిందు చేస్తున్నాయి. ఈ పచ్చటి తోరణాలు రోడ్లకు, బస్తీలకు, కాలనీలకు కొత్త హంగులను తీసుకొచ్చాయి.

10.65 లక్షల మొక్కలు...

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు 10.65 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా విధించారు. మణికొండ మున్సిపాలిటీలో 2.30 లక్షలు, నార్సింగ్ మున్సిపాలిటీలో 1.19 లక్షలు, శంషాబాద్ మున్సిపాలిటీలో 1.78 లక్షలు, శంషాబాద్ గ్రామ పంచాయతీల్లో 1.68 లక్షలు, బండ్లగూడ కార్పొరేషన్‌లో 2.30 లక్షలు, రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ పరిధిలో 1.40 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇం దుకు

విద్యుత్ వైర్ల కింద నాటొద్దు



బస్తీలు, కాలనీలు, రోడ్ల పక్కన వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ వైర్ల కింద ఈ మొక్కలను నాటుతుండటంతో పెరిగిన కొన్ని రోజులకే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వీటిని అడ్డదిడ్డంగా నరికివేస్తున్నారు. దీంతో ఏపుగా పెరిగిన మొక్కలను ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. అధికారులు విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటవద్దని మనవి.
– కృష్ణారావు, బండ్లగూడ


బండ్లగూడ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

గాను ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచారు. ఈ నర్సరీలో పెంచిన మొక్కలలో ఆయా ప్రాంతాల్లో నాటుతున్నారు.

అన్ని రకాల మొక్కలు...

వన మహోత్సవ కార్యక్రమంలో నాటేందుకు నర్సరీలలో అన్ని రకాల మొక్కలను పెద్ద ఎత్తున పెంచారు. పూలు, పండ్లు, ఔషధ మొక్కలతో పాటు గ్రీనరీని పెంచే మొక్కలను సైతం పెంచారు. ప్రస్తుతం ఈ మొక్కలన్నింటినీ ప్రత్యేకంగా నాటుతున్నారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లలో నివాసముంటున్న వారికి ఉచితంగా మొక్కలను అందజేస్తున్నారు.

- గతంలో ఎన్నడూ లేని విధంగా ఔషధ మొక్కలను పెంచి పంపిణీ చేస్తుండటంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. ప్రజలు స్వచ్ఛందంగా ఔషధ మొక్కలు, పూల మొక్కలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ప్రజల ఆసక్తికి గుర్తించిన అధికారులు ప్రతి ఇంటికీ వారు కోరిన ప్రమాణం మొక్కలను అందజేస్తున్నారు.


నార్సింగి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఏపుగా పెరిగిన మొక్కలు

నాటింది 8.53 లక్షల మొక్కలు...

నియోజకవర్గంలో అధికారులు విధించిన టార్గెట్‌ను 80 శాతం పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం టార్గెట్‌ను ఈ నెల చివరి వరకు పూర్తి చేసేందుకు అధికారులు తగు కార్యక్రమాలను చేపడుతున్నారు.

- మణికొండ మున్సిపాలిటీలో 1.90 లక్షలు, నార్సింగ్‌లో 1,12,120, శంషాబాద్ 1,68,200, బండ్లగూడ కార్పొరేషన్‌లో 2 లక్షలు, శంషాబాద్ గ్రామ పంచాయతీల్లో 63 వేలు, రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో 1.20 లక్షల మొక్కలను నాటారు.

రోడ్డు రూపురేఖలు మారుస్తాయి



రోడ్డు మధ్యలో మొక్కలు నాటడంతో వాటి రూపురేఖలు మారుతున్నాయి. ప్రయాణికులకు ఆహ్లాదకరంగా మొక్కలు కనిపిస్తున్నాయి. ఖాళీ స్థలాలు ఉన్న ప్రతి చోట మొక్కలు నాటాం. డివైడర్లకు మంచి రంగులు, బొమ్మలు వేయడంతో మరింత శోభ వచ్చింది. ప్రజలు అవకాశం ఉన్న ప్రతి చోటా మొక్కలను నాటి పరిసరాలను పచ్చదనంతో నింపాలి.
– కృష్ణమోహన్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమిషనర్

వేడుకగా మల్లన్న స్వామి జాతర


ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, బండ్లగూడలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న స్వామి బోనాల జాతరను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి మల్లన్న స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు దరువుల మధ్య అందరినీ ఆకట్టుకునేలా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేడుకల్లో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, శేఖర్, బాబుయాదవ్, పాపయ్యయాదవ్, రఘు, రాజుగౌడ్, హనుమంత్, సత్య, యాదవ సంఘం సభ్యులు, వివిధ పార్టీల నాయకులతో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో యాదవ సంఘం సభ్యులు, భక్తులు

వాటర్ ట్యాంక్‌ను అందుబాటులోకి తేవాలి


ట్యాంక్ నుంచి లీకవుతున్న నీరు

బండ్లగూడ: ప్రజల అవసరాల నిమిత్తం నిర్మించిన వాటర్ ట్యాంక్, రిజర్వాయర్‌లు వినియోగంలోకి రాకముందే శిథిలావస్థకు చేరుకుందని ఆల్ కాలనీ ఫెడరేసన్ అధ్యక్షుడు పీసరి వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబు ఆరోపించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ, బైరాగిగూడ పరిధిలోని కాలనీల వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఏసీఎఫ్ సభ్యులు ఆదివారం రెండు సంవత్సరాలుగా వాడుకలోకి రాకుండా ఉన్న వాటర్‌ట్యాంక్, రిజర్వాయర్‌లను సందర్శించారు. కొత్తగా నిర్మించిన ఈ రిజర్వాయర్ వాడుకలోకి రాకముందే చాలా ప్రదేశాలలో వాటర్ లీకు అవుతున్నదన్నారు. పెరిగిన నీటి వినియోగం వల్ల, రోజు వారీ అవసరాలకు సరపడా నీరు అందక కాలనీ వాసులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు వెంటనే కొత్త వాటర్ ట్యాంక్, రిజర్వాయర్‌లను వినియోగంలోకి తీసుకురావాలని జలమండలి జనరల్ మేనేజర్, మేనేజర్‌లను కోరామని వారు పేర్కొన్నారు. ఈ వాటర్ ట్యాంకులు వినియోగంలోకి తీసుకురాకపోతే ఎమ్మెల్యే, పైఅధికారుల దృష్టికి తీసుకెళతామని... పెద్ద ఎత్తున ఆల్ కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ వాటర్ ట్యాంక్‌లకు తగు మరమ్మతులను చేయించి ఈ సమస్యను 20 రోజులలో పరిష్కరిస్తామని జలమండలి జనరల్ మేనేజర్, మేనేజర్ హామీ ఇచ్చారన్నారు. నేతలు వంశీ, శశిధర్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్, చారి, విజయ్, హేమ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానిపై కేసు

బంజారాహిల్స్: ప్రైవేట్ వ్యక్తితో మ్యాన్‌హోల్ పనులు చేయించిన ఇంటి యజమానిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని శ్రీరాంనగర్‌కు చెందిన ఎంఏ పహాబ్ గ్లాస్ ఫిట్టింగ్ పనులు చేస్తుంటాడు. అతని ఇంటికి 12 ఏళ్లుగా సీవరేజీ కనెక్షన్ ఉంది. కొన్ని నెలలుగా తరచూ ఇంటి ముందు మ్యాన్‌హోల్ పొంగుతోంది. దీంతో పలుమార్లు జలమండలి టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తున్నాడు. ఈనెల 11న మరోసారి ఫిర్యాదు చేశాడు. దీంతో 16న జలమండలి సీవరేజీ క్లీనింగ్ యంత్రంతో వచ్చిన నాగరాజు అనే ఉద్యోగి సమస్యను పరిశీలించారు. మ్యాన్‌హోల్ వద్ద సుమారు 10 ఫీట్ల మేర ఉన్న లైన్‌లో పైపులు పగిలిపోయాయని మరమ్మతు చేయడం తమ పనికాదని, మీరే కూలీలతో పనులు చేయించుకోవాలని చెప్పి వెళ్లిపోయాడు. దీంతో 21న లేబర్ అడ్డాకు వెళ్లి ఇద్దరు కూలీలను తీసుకువచ్చి మ్యాన్‌హోల్‌లో బ్లాకేజీని తొలగింపజేశారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి మ్యాన్‌హోల్‌లో దిగిన వ్యక్తి ఫొటోను తీసి మరుసటి రోజు ఓ పత్రికలో ప్రచురించడంతో నిబంధనలకు విరుద్ధంగా మ్యాన్‌హోల్‌లో వ్యక్తి దిగడం ప్రమాదకరమని, దీనికి కారణమైన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తైక్వాండోలో సత్తాచాటిన విద్యార్థులు


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్

మణికొండ: సీబీఎస్‌ఈ పాఠశాలల స్థాయి అండర్-14, 17 విభాగాల్లో జరిగిన తైక్వాండో పోటీలలో మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మౌంట్ లిటేరా జీ స్కూల్ విద్యార్థులు రాణించారు. సీబీఎస్‌ఈ సౌత్ జోన్-1 చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 21వ తేదీ నుంచి ఆదివారం వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా మార్కాపురంలో నిర్వహించారు. అందులో పాల్గొన్న జీస్కూల్ విద్యార్థిని అండర్-14 విభాగంలో కాంస్య పతకం, అండర్-17 విభాగంలో ధృతి కాంస్య పతకాలను సాధించారని కోచ్ డి.వెంకటేశ్ తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే మరిన్ని చాంపియన్ షిప్ పోటీలలో తమ విద్యార్థులు మరిన్ని పతకాలను సాధించి రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ పాఠశాల విద్యార్థులు సౌత్ జోన్ స్థాయి పోటీలో పతకాలను సాధించటంతో యాజమాన్యం వారిని ప్రత్యేకంగా అభినందించిందని కోచ్ తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 16వ డివిజన్ రఘురాంనగర్ కాలనీలో చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వార్డు ఇన్‌చార్జ్ టింకురెడ్డితో కలిసి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచితంగా డాక్టర్ల బృందం వైద్య సేవలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నందుకు చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీని అభినందించారు. ఉచిత క్యాంప్‌లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


వైద్య సేవలను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్

హిందూ సంస్కృతి ఎంతో గొప్పది


బండారి వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: హిందూ సంస్కృతి ప్రపంచంలోనే అత్యున్నతమైనదని బండారి విద్యా సంస్థల చైర్మన్ బండారి వెంకటేష్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో భజన భారతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణ ఆలయంలో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..పిల్లల్లో చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు ఇటువంటి భజన పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. భజన భారతి వారు మూడు దశాబ్దాలకు పైగా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి పాఠశాలలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో 21 టీంలు పాల్గొన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, అన్నా యాదవ్, వజ్రలింగం, రాధాకృష్ణ, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, జొన్నకుంటి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడాపోటీలు

శ్రీనగర్‌కాలనీ: గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని రాజీవ్‌నగర్‌కాలనీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కమిటీ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, గౌరవ అధ్యక్షులు బీఎస్ మూర్తి, మోహన్‌రావు, బాపయ్యచౌదరి, సుబ్బరావయ్య పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన


రామంజాపూర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నాటిక

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్‌లో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు శనివారం రాత్రి నాటిక ప్రదర్శనతో పలు సామాజిక అంశాలపై అవగాహన కలిగించారు. 'కృతజ్ఞత విలువ-వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సంరక్షణ' అనే అంశంపై నాటకాన్ని ప్రదర్శించారు. తల్లిదండ్రుల ప్రేమ, త్యాగాలను గుర్తించుకుని వృద్ధాప్యంలో వారిని గౌరవిస్తూ సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సమాజానికి అపకీర్తి తెస్తుందని తెలిపారు. డప్పు వాయిద్యాలతో బుర్రకథను జోడించి సాగిన నాటిక ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది.

అధ్యాపకుడికి సన్మానం


యాదగిరిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ గురుకల (బాయ్స్) డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు యాదగిరి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షహనా నజ్మీన్‌తో పాటు సహచర అధ్యాపకులు ఆదివారం శాలువాలతో ఘనంగా సత్కరించి పూలమాలలు వేసి సన్మానించారు. మరిన్ని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిలషించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీనగర్‌కాలనీ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, స్థానిక నేతలతో కలిసి ఆదివారం పర్యటించారు. ఆయన వెంట నేతలు రవిగౌడ్, రమేశ్ నాయక్, ఆకాశ్ పాల్గొన్నారు.

లూథెరన్ చర్చిలో 'మహిళల ఆదివారం'

మణికొండ: సేవియర్స్ లూథెరన్ చర్చిలో ఆదివారం ప్రత్యేకంగా మహిళల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుప్పాలగూడ అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న చర్చిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో స్వరూపరాణి ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బైబిల్ ప్రవచనం ప్రకారం స్త్రీల పాత్ర, కుటుంబంలో వారి ఆధ్యాత్మిక బాధ్యత, సంఘంలో దేవుని కార్యములో స్త్రీల సేవ గురించి వివరించారు. మహిళలు ప్రత్యేక భక్తి ప్రార్థనలు చేశారు. చర్చి ఫాస్టర్ దయారత్నం, నరేష్ వారికి ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు మాధురి, ప్రతిభ, సుస్మిత, మెర్సీన ప్రశాంతి, సుజిత, సలోమి, నిర్మల అనూష, మంజూష తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు

మజ్లిస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో యువతకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన ఖాదర్‌బాగ్ బస్తీకి చెందిన పలువురు యువకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ ఏరియా కమిటీలలో యువతకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు.

ఒత్తిళ్లకు లొంగవద్దు..

విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుల్స్ నిర్వాహకుల వైర్లను తొలగించడంలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగవద్దు అని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. నిజాం కాలనీ, టోలిచౌకీ, అల్‌అస్‌నత్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు వేసిన ప్రైవేటు కెబుల్స్‌ను తొలగించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న నానల్‌నగర్ విద్యుత్ ఈఈ ముస్తఫా బాబాతో మాట్లాడారు


నానల్‌నగర్ ఖాదర్‌బాగ్‌కు చెందిన మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్